

పల్లి రైతుల కన్నెర్ర

వేరుశనగ ధరలు తగ్గించడంతో జడ్చర్లలో రైతులు ఆందోళనకు దిగారు.

వివరాలు 8లో ►



సీఎం పరపతి పెంచుదాం

లోక్‌సభ అభ్యర్థిని గెలిపించి సీఎం పరపతి పెంచుదామని వంశీచంద్‌రెడ్డి అన్నారు.

వివరాలు 10లో ►

గరిష్టం/కనిష్టం
33.9/18.5

వాతావరణం

మధ్యాహ్నం ఎండ తీవ్రత, ఉదయం, రాత్రి చలి కాస్త పెరుగుతుంది. ఆకాశం రోజంతా నిర్మానుష్యంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

చిన్న బాలయ్య సేవలు మరువలేనివి



వనపర్తిటౌన్: గంధం చిన్న బాలయ్య సేవలు మరువలేనివని జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన సంస్మరణ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో విద్య, సామాజిక, ఆధ్యాత్మిక రంగాలకు గంధం చిన్న బాలయ్య సేవలు అందించారని, జిల్లాకేంద్రంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయించినట్లు గుర్తుచేశారు. ఆలయాలు, మసీదులు, చర్చిలకు విరాళాలిచ్చి సేవాగుణాన్ని చాటుకున్న గొప్ప వ్యక్తని కొనియాడారు. డా. మురళీధర్, సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్, మందరయ్య, వినయ్‌కుమార్, సీపీఎం నాయకుడు జబ్బార్, నాగేశ్వర్, కవి జనజ్వాల, నిర్వాహకుడు గంధం నాగరాజు, ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు గంధం రాములు, రాజారాంప్రకాశ్, గంధం గట్టయ్య, చెన్నకేశవులు, రమాకాంత్, జెడ్పీటీసీ వెంకటస్వామి, చెన్నకేశవులు పాల్గొన్నారు.

సంక్షేమబోర్డు నిధులు ఖర్చు చేయాలి

పెబ్బేరు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సంక్షేమబోర్డులో ఉన్న నిధులు భవన నిర్మాణరంగ కార్మికులకు ఖర్చు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు పుట్టా ఆంజనేయులు, ప్రధానకార్యదర్శి బొబ్బిలి నిక్సన్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఉపాధ్యక్షుడు వెంకటయ్య అధ్యక్షతన జరిగిన సంఘం సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. 60 ఏళ్లు నిండిన కార్మికుడికి రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని, పిల్లల చదువులకు స్కాలర్‌షిప్‌లు అందించి ఆదుకోవాలని కోరారు. కార్మికులు ఓంకార్, నరేందర్, వసంత్, నాగరాజు, రాబర్ట్, నర్సింహ పాల్గొన్నారు.

మాజీ మంత్రి ఉదారత



పెబ్బేరు రూరల్: మండలంలోని పెద్దగూడెం గ్రామ రైతు నాగపురి ఆంజనేయులుకు చెందిన రెండు కాడెద్దులు ఇటీవల నీటిలో మునిగి చనిపోయాయి. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి బుధవారం బాధితుడిని పరామర్శించి రెండు కోడెలను అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు మాజీ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త వెంకటమ్మ మృతిచెందగా ఆమె కుమారుడు సాయికుమార్‌కు రూ.2 లక్షల బీమా చెక్కు అందజేశారు. పెబ్బేరుకు చెందిన వరుణ్‌యాదవ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా విషయం తెలుసుకొని స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, ఎద్దుల కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, మీడియా కన్వీనర్ నందిమళ్ల శ్యామ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వనం రాములు, మాణిక్యం, దిలీప్‌రెడ్డి, సర్పంచ్ కొండన్న, నాయకులు గొని బుచ్చారెడ్డి, దేవేందర్, అశోక్ కుమార్, లక్ష్మీకాంతరెడ్డి పాల్గొన్నారు.

హరిత లక్ష్యం ఖరారు

2024-25కు జిల్లా ప్రణాళిక రూపొందించిన అధికారులు



అమరచింత మండలం మస్తీపురం నర్సరీలో వివిధ రకాల మొక్కలు

- జిల్లావ్యాప్తంగా 22.55 లక్షలు నాటేలా కార్యాచరణ
- గ్రామస్థాయిలో పది వేల మొక్కల సామర్థ్యంతో నర్సరీ నిర్వహణ
- ఇంటింటికి ఆరు మొక్కల పంపిణీ

అమరచింత: పచ్చదనాన్ని పెంపొందించేందుకు విరివిగా మొక్కలు నాటి సంరక్షించేందుకు అధికారులు తగిన ప్రణాళికలు రూపొందించారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లా హరిత లక్ష్యం నిర్దేశించుకొని మండలాల వారీగా ఎన్ని మొక్కలు నాటాలో నిర్ణయించి అందుకు అనుగుణంగా ముందుకు సాగుతున్నారు. వానాకాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా ఇంటింటికి ఆరు మొక్కల చొప్పున 3.21 లక్షలు, ఖాళీ ప్రదేశాల్లో 10 లక్షల, మొత్తంగా 22.50 లక్షల మొక్కలు నాటి సంరక్షించేలా కార్యాచరణ రూపొందించారు. సంబంధిత అధికారులు ఇప్పటి నుండే గ్రామాల్లో పర్యటిస్తూ నర్సరీల నిర్వహణతో పాటు మొక్కల ఎదుగుదలను పరిశీలించి వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి మండలంలో సుమారు రెండు లక్షల మొక్కలు పెంచాలనే లక్ష్యంతో నర్సరీల నిర్వహణపై అధికారులు దృష్టి సారించారు. ప్రభుత్వ స్థలాలతో పాటు ప్రార్థన మందిరాలు, ఆలయాల ఆవరణలో మొక్కలు నాటనున్నారు. ఉపాధి కూలీలతో నర్సరీల్లో మొక్కలకు నీటిని అందిస్తూ వాటిని నాటేందుకు గుంతలు సైతం తవ్విస్తూ కూలీలకు పనులు కల్పించేలా ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా తగిన వివరాలు సేకరిస్తున్నారు.

పూలు, పండ్ల మొక్కలు..

ప్రతి ఇంటికి ఆరు పూలు, పండ్ల మొక్కలు అందించి వాటిని నాటి సంరక్షించేలా యజమానులను ప్రోత్సహించే బాధ్యతను గ్రామపంచాయతీ, మహిళ సమాఖ్య సిబ్బంది, సభ్యులకు అప్పగించే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. ఇంటి పెరట్లలో నాటే పండ్లు, పూల మొక్కలను ఇతర ప్రాంతాల నుంచి తీసుకురాకుండా ఆయా గ్రామాల్లోని నర్సరీల్లో పెంచుతున్నారు. ప్రతి గ్రామపంచాయతీలో పదివేల మొక్కల సామర్థ్యంతో నర్సరీని ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతను ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామపంచాయతీ కార్యదర్శికి అప్పగించారు. వానాకాలంలో నర్సరీలో పెరిగిన మొక్కలను ఆయా గ్రామాల్లోనే నాటేందుకు అనువైన స్థలాలను ముందస్తుగానే ఎంపిక చేస్తున్నారు.

మండలాల వారీగా మొక్కల లక్ష్యం..

మండలం	గ్రామ పంచాయతీలు	నాటాల్సిన మొక్కలు: ఇంటి ఆవరణలు	నాటాల్సిన మొక్కలు: ఖాళీ ప్రదేశాలు	మొత్తం
పాన్‌గల్	28	1,11,800	34,700	1,46,500
ఖిల్లాఘనపురం	27	1,08,300	32,700	1,41,000
వనపర్తి	26	1,03,800	32,200	1,36,000
కొత్తకోట	22	85,700	27,300	1,13,000
పెద్దమందడి	22	87,800	27,200	62,500
పెబ్బేర్	20	76,300	25,200	1,15,000
మదనాపురం	17	65,800	21,200	87,000
చిన్నంబావి	17	65,300	21,700	87,000
గోపాల్‌పేట	15	60,300	19,200	79,500
అమరచింత	14	54,300	17,700	72,000
వీపనగండ్ల	14	53,250	18,250	71,500
ఆత్మకూర్	13	50,250	16,750	67,000
రేవల్లి	12	46,800	15,700	62,500
శ్రీరంగాపురం	8	30,300	11,200	41,500



సింగంపేటలో నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

లక్ష్యాన్ని చేరుకుంటాం..



హరిత లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు సిద్ధం చేస్తున్నాం. ప్రతి గ్రామపంచాయతీలో పది వేల సామర్థ్యంతో నర్సరీ ఏర్పాటు చేశాం. మొక్కలకు నిత్యం నీటిని అందించేందుకు వాచర్లను నియమించాం. ఇంటింటికి ఆరు పూలు, పండ్ల మొక్కలు అందించడంతో పాటు ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.

– నర్సింహులు, డీఆర్డీఓ

అంగన్‌వాడీల్లో నాణ్యమైన విద్య అందించాలి



ఆర్డర్ కాపీలు అందజేస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆటపాటలతో పాటు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సూచించారు. నియోజకవర్గంలోని మినీ అంగన్‌వాడీలను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశం మేరకు బుధవారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే వారికి అప్‌గ్రేడ్ ఉత్తర్వులు అందజేసి మాట్లాడారు. చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ కృష్ణచైతన్య, సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పండుగలు సంప్రదాయాల్లో భాగం..

ఖిల్లాఘనపురం: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే పండుగలు మన సంస్కృతీ సంప్రదాయాల్లో భాగమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వెనికితండా, దొంతికుంటతండాలో నిర్వహించిన పోచమ్మ పండుగలో ఆయన పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పండుగల సందర్భంగా కుటుంబసభ్యులంతా ఒకే దగ్గరికి చేరడంతో భేదాభిప్రాయాలు తొలగి సంతోషం వెల్లివిరుస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సతీష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, సింగిల్‌విండో డైరెక్టర్ సాయిచరణ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటయ్య, నాయకులు వెంకటేశ్వర్‌రావు, శ్యాంసుందర్‌రెడ్డి, మానయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతపై దృష్టి సారించాలి..

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థినుల్లో రక్తహీనత సమస్య ఉన్న వారిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సూచించారు. బుధవారం స్థానిక కస్తూర్బా విద్యాలయంలో ఎనీమియా ముక్త్ తెలంగాణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించి లోపించిన హిమోగ్లోబిన్ శాతం పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల రక్త పరీక్షల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు డా. స్వప్న, డా. లక్ష్మి, డా. శ్రీవిద్య, పాఠశాల ప్రత్యేక అధికారి లోహితారెడ్డి, జీసీడీఓ శుభలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలుచేస్తాం

- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలుచేసి తీరుతామని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని ప్రొ. జయశంకర్ సమావేశ మందిరంలో ఎంపీపీ గుంత మౌనిక అధ్యక్షతన జరిగిన మండల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసినట్లు చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వెంచర్లు, రోడ్లకు కూడా రైతుబంధు సాయం అందించిందని.. వాటన్నింటిపై విచారణ జరిపి అర్హులైన రైతులకు మాత్రమే ఇవ్వనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశానికి పూర్తిస్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకాకపోవడంతో తూతూమంత్రంగా సాగింది. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, ఎంపీడీఓ రవీందర్, తహసీల్దార్ బాల్‌రెడ్డి, మదనాపురం మార్కెట్ చైర్మన్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కొందరు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

విషాదంలోనూ ఔదార్యం

- బ్రెయిన్‌డెడ్ అయిన యువకుడి అవయవాలు దానం చేసిన కుటుంబీకులు

వీపనగండ్ల: వీపనగండ్ల మండలం తూంకుంట సమీపంలో ఇటీవల చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో గాయపడిన సురేష్ (27) చికిత్స పొందుతూ బుధవారం బ్రెయిన్ డెడ్ అయ్యాడు. పసుపుల గ్రామానికి చెందిన సురేష్.. నాలుగు రోజుల కిందట చిన్నంబావి మండలంలోని అమ్మాయిపల్లి నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు వైద్యులు నిర్ధారించారు. సురేష్ అవయవాలను దానంచేసి, కుటుంబసభ్యులు ఔదార్యం చాటుకున్నారు. కాగా మృతుడి భార్య సొప్పరి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రవి ప్రకాష్ తెలిపారు.



సురేష్ (ఫైల్)

మెరుగైన వైద్యం అందించాలి

కొత్తకోట రూరల్: ఉపకేంద్రాల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా ప్రోగ్రామ్ అధికారి డా. సాయినాథ్ వైద్యసిబ్బందికి సూచించారు. బుధవారం పెద్దమందడి మండలంలోని మనిగిళ్ల, పెద్దమందడి ఉపకేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లలోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలన్నారు. టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతి బుధవారం క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు సమయపాలన పాటించాలని, టీకాల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ఆయన వెంట డా. పరిమళ, సూపర్‌వైజర్ ఓంప్రకాష్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఆలోచించాలి

- అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తిటౌన్: విద్యార్థులు ఉన్నతంగా ఆలోచిస్తే జీవితంలో అత్యున్నత శిఖరాలకు చేరుకుంటారని అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లాకేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థినులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండి సమాజంలో ఎదురయ్యే సమస్యలకు ఎదురు నిలబడి పరిష్కరించుకోవాలన్నారు. విద్యార్థినులు, మహిళలు ఒకరితోడు ఆశించకుండా గుండె ధైర్యంతో నిలబడితే సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలు తగ్గుతాయని తెలిపారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. భయాన్ని వీడి ముందుకు సాగాలని, పాఠశాల ముందు, తర్వాత జీవితం వేరేలా ఉంటుందన్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన కబడ్డీ, వ్యాసరచన, డ్రాయింగ్, స్లోగన్ రైటింగ్, సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బుక్స్, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి రామమహేశ్వర్‌రెడ్డి, డీవైఎస్ఓ సుధీర్‌కుమార్‌రెడ్డి, జీసీడీఓ శుభలక్ష్మి, సీడీపీఓ కృష్ణ చైతన్య, డిస్ట్రిక్ట్ మిషన్ కో–ఆర్డినేటర్ ఎస్.భాస్కర్, లోహిరాంబాబు, జిల్లా మహిళా సాధికార కేంద్రం సిబ్బంది వాణి, సలోమి, సుమ, ప్రమీల, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రదర్శనను తిలకిస్తున్న అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్

పర్సన్ ఇన్‌చార్జులా.. ప్రత్యేకాధికారులా?

- ఫిబ్రవరి 1తో ముగియనున్న సర్పంచ్‌ల పదవీకాలం
- పల్లె పాలనకు కసరత్తు చేస్తున్న యంత్రాంగం
- ప్రత్యేక పాలన వద్దని.. తమనే కొనసాగించాలని సర్పంచ్‌ల డిమాండ్
- ఇప్పట్లో గ్రామపంచాయతీ ఎన్నికలు లేనట్లే?

అచ్చంపేట: స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుత సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డుసభ్యుల పదవీ కాలం ఫిబ్రవరి 1తో ముగియనుంది. మరో 10 రోజుల్లో పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశం కనిపించడం లేదు. ఎన్నికలు నిర్దేశిత గడువులోగా జరగవని, ప్రత్యేకాధికారుల పాలన తప్పనిసరని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేకాధికారుల జాబితాను రూపొందించే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమై ఉన్నట్లు సమాచారం. 2019లో పంచాయతీ ఎన్నికలకు జనవరి 1న ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ వెలువడింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జనవరి 21, 25, 30 తేదీల్లో మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించారు. ఫిబ్రవరి 1న సర్పంచ్‌లు, వార్డు సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. తాజాగా పదవీకాలం ముగియనుండటంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,719 గ్రామపంచాయతీల్లో ఈ ఎన్నికలు జరగాల్సి ఉంది.

పర్సన్ ఇన్‌చార్జులకు అవకాశం లేని కొత్త చట్టం..

నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం నిర్దేశిత గడువు లోగా ఎన్నికలు నిర్వహించాలి. లేని పరిస్థితుల్లో ప్రత్యేకాధికారులను నియమించి పల్లెపాలనను కొనసాగించాల్సి ఉంటుంది. పదవీకాలం పూర్తయిన తదనంతరం ఆయా పాలకవర్గాలను పర్సన్ ఇన్‌చార్జులుగా నియమించేందుకు కొత్త చట్టం అనుమతించడం లేదు. అలా వారిని నియమించాలంటే అసెంబ్లీలో చట్టసవరణ లేదా ఆర్డినెన్స్‌ను తీసుకురావాల్సి ఉంటుంది. ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలనకే మొగ్గుచూపుతున్నట్లుగా తెలుస్తోంది.

మండలస్థాయి అధికారులతో..

గ్రామపంచాయతీలకు మండలస్థాయి ప్రత్యేక అధికారులను నియమించనున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో భాగస్వామ్యం లేని శాఖల అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించాలనే ఆలోచనలో జిల్లాయంత్రాంగం ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మండల పరిషత్‌లోని సూపరింటెండెంట్, ఎంపీఓ, వ్యవసాయాధికారులు, పశువైద్యాధికారులు, ఐసీడీఎస్, ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన ఏఈలను నియమించనున్నట్లు సమాచారం. మేజర్ పంచాయతీలకు జిల్లాస్థాయి అధికారులను నియమించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. కోవిడ్ కారణంగా రెండేళ్లు పూర్తిస్థాయిలో పాలన అందించలేకపోయామని, ఆ మేరకు తమ పదవీ కాలన్ని పొడిగించాలని సర్పంచ్ సంఘాలు కోరుతున్నారు.



అమరచింత మండలం చింతరెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం

ఉమ్మడి జిల్లాలో పంచాయతీల వివరాలు

జిల్లా	మహబూబ్‌నగర్	నాగర్‌కర్నూల్	వనపర్తి	జోగులాంబ గద్వాల	నారాయణపేట
గ్రామపంచాయతీలు	468	461	255	255	280

రిజర్వేషన్లపై సందిగ్ధం..

పదేళ్లపాటు రిజర్వేషన్లు ఉండేలా అప్పట్లో నూతన పంచాయతీరాజ్ చట్టంలో పొందుపర్చారు. 2018లో ఎన్నికలు నిర్వహించిన సమయంలో నిర్దేశించిన రిజర్వేషన్లు పదేళ్ల పాటు అమలులో ఉంటాయని వెల్లడించారు. అధికార ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు పెంచుతామని ఎన్నికల హామీల్లో ప్రకటించింది. బీసీ గణన చేపట్టి ఆయా గణాంకాల ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తామని తెలిపింది. దీనికి తోడు గడిచిన కాలంలో నూతన పంచాయతీల సంఖ్య పెరిగిన నేపథ్యంలో రిజర్వేషన్ల మార్పు తప్పనిసరిగా కనిపిస్తోంది. ఈ విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకు ఈ విషయం సందిగ్ధత కొనసాగుతుంది.

భారీగానే ఆశావహుల సంఖ్య..

సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుండటంతో పదవులను ఆశిస్తున్న వారి సంఖ్య ఈసారి భారీగానే ఉండనుంది. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ అండదండలతో బరిలో ఉండే వారు ఎక్కువే అని చెప్పవచ్చు. కొందరు ఎలాగైనా బరిలో ఉండాలనే కోరికతో ఇప్పటికే ఆయా గ్రామాల్లో స్వచ్ఛంద సేవలు చేపడుతున్నారు. మరికొందరు స్థానికంగా చేపట్టే పలు కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఈ ఎన్నికలు పార్టీ గుర్తు మీద జరగవు. పోటీ చేసే అభ్యర్థులకు పార్టీ మద్దతు మాత్రమే ఇస్తుంది. దీంతో ప్రధాన పార్టీల మద్దతు తమకు కావాలని నియోజకవర్గాల్లో ముఖ్య నేతల చుట్టూ ఆశావహులు చక్కర్లు కొడుతున్నారు. సర్పంచ్ పదవి ఆశించే వారు ఈసారి తాను పోటీలో ఉంటానని మనసులో మాట చెబుతున్నారు. ప్రధానంగా మండల కేంద్రాలు, పెద్దపంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థులకు డిమాండ్ ఏర్పడింది.


ప్రభుత్వం ఆలోచించాలి..



కరోనాతో గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో చేయలేకపోయాం. గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించే వరకు తమనే సర్పంచులుగా కొనసాగించాలి. మరో 6 నెలలు అవకాశం ఇచ్చే విషయమై ప్రభుత్వం ఆలోచించాలి.

– కస్తూరి శాంత, సర్పంచ్, మల్కిమియాన్‌పల్లి (ఖిల్లాఘనపురం)

ఎన్నికల వరకు కొనసాగించాలి..



సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుంచి నిధుల సమస్య వెంటాడింది. మొదటి ఏడాది ట్రాక్టర్ కొనుగోలు చేయడానికి నిధులు సరిపోయాయి. కరోనా మహమ్మారితో రెండు సంవత్సరాలు ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో నిధులు మంజూరు కాలేదు. అనంతరం ఎమ్మెల్యే ఎన్నికల హడావుడి మొదలు కావడంతో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా రాలేదు. కొత్త ప్రభుత్వం ఆలోచించి ఎన్నికలు నిర్వహించే వరకు తమను కొనసాగించాలి.

– నిర్మల, సర్పంచ్, పర్వతాపురం (ఖిల్లాఘనపురం)

నిర్ణయం ప్రభుత్వానిదే..



ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది వివరాల సేకరణ పూర్తి చేశాం. ప్రత్యేకాధికారుల పాలన, ప్రస్తుత సర్పంచ్‌లనే పర్సన్ ఇన్‌చార్జులుగా కొనసాగించడమా అనే నిర్ణయం ప్రభుత్వానిదే.

– కృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి, నాగర్‌కర్నూల్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

వంగూరు: వంగూరు మండలం సర్వారెడ్డిపల్లి స్టేజీ సమీపంలో శ్రీశైలం – హైదరాబాద్ ప్రధాన రహదారిపై బుధవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. స్థానికుల వివరాల మేరకు.. వెల్దండ మండలం కొట్ర గ్రామానికి చెందిన బోగరాజు శ్రీనివాసులు (42) సర్వారెడ్డిపల్లి స్టేజీ సమీపంలో కొనసాగుతున్న నెల్లిగుట్ట ఉర్సు జాతరలో చికెన్ అమ్ముకోవడానికి వచ్చాడు. చికెన్ విక్రయాలు ముగిసిన తర్వాత రాత్రి రోడ్డు పక్కన బైక్ నిలిపి, నిద్రిస్తుండగా.. అటుగా వెళ్తున్న టిప్పర్ బైక్‌ను ఢీకొట్టడంతో శ్రీనివాసులు తలపై పడింది. అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య సుమిత్ర, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ ముజీఫ్ రహమాన్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్‌ను గుర్తించినట్లు పేర్కొన్నారు.

కారు బోల్తాపడి..

కృష్ణా: ప్రమాదవశాత్తు కారు బోల్తాపడిన ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన కృష్ణా మండలం చేగుంట శివారులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయభాస్కర్ వివరాల మేరకు.. కర్ణాటకలోని సైదాపూర్‌కు చెందిన రమేష్ (40) చేగుంటలో దాబ నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి పనులను ముగించుకుని కారులో స్వగ్రామానికి వెళ్తుండగా.. కారు అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలై మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి


కుర్మయ్య (ఫైల్)

పెంట్లవెల్లి: బావిలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన పెంట్లవెల్లి మండలం కొండూరులో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కొండూరుకు చెందిన కుర్వ కుర్మయ్య (35) మంగళవారం వ్యవసాయ పొలం పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం సమీపంలోని బావిలో నీళ్లు తాగేందుకు వెళ్లి, ప్రమాదవశాత్తు నీటిలో పడ్డాడు. అతడికి ఈత రాకపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. విషయం తెలియని కుటుంబ సభ్యులు అతడి కోసం వెతికారు. బావిలో మృతదేహం కనిపించడంతో గ్రామస్తుల సహాయంతో బయటికి తీశారు. మృతుడికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కాగా ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

పెద్దేరు రూరల్: ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వనపర్తి మండలం అంకూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ నాగన్న కథనం మేరకు.. గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి (53) భార్య అలివేలమ్మతో తరచూ గొడవపడుతుండటంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మనస్తాపానికి గురైన ఆయన ఇంట్లో ఉరేసుకుని మృతిచెందాడు. చుట్టుపక్కల ఇళ్లవారు గుర్తించి వెంటనే భార్యకు సమాచారం ఇచ్చారు. ఆమె వచ్చి పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

వివాహిత ఆత్మహత్య.. కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన వివాహిత వైష్ణవి (26) ఆత్మహత్య ఘటనపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు. వైష్ణవిని భర్త, అత్తమామలు వేధింపులకు గురిచేయడంతో ఆత్మహత్యకు పాల్పడిందని.. మృతురాలి తల్లి మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిరుతల దాడిలో రెండు దూడలు హతం

ఖిల్లాఘనపురం: వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలంలో చిరుతలు హడలెత్తిస్తున్నాయి. మంగళవారం అర్ధరాత్రి షాపూర్, మానాజీపేట శివారుల్లో పశువుల కొట్టాలపై దాడిచేసి రెండు దూడలను హతమార్చాయి. స్థానికుల వివరాల మేరకు.. షాపూర్‌కు మామిళ్ల భీమయ్య తన వ్యవసాయ పొలంలోని కొట్టంలో పశువులను కట్టేయగా.. చిరుత దాడిచేసి ఓ దూడను హతమార్చింది. అదేవిధంగా మానాజీపేటకు చెందిన కర్ని చిన్న నర్సింహ పశువుల కొట్టంలో లేగదూడపై చిరుత దాడిచేసి, మాంసాన్ని ఆరగించింది. చిరుతల దాడితో రైతులు ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ రేంజ్ అధికారి భాస్కరాచారి, సిబ్బంది ఆంజనేయులు, చంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ ఘటనా స్థలాలను పరిశీలించారు.



వేరుశనగ రైతుల కన్నెర్ర


బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

- ధరల తగ్గింపుపై ఆగ్రహం
- బాదేపల్లి మార్కెట్ కార్యాలయం ఎదుట ధర్నా
- క్వింటా ధర రూ.2వేల మేర తగ్గడంపై ఆందోళన


మార్కెట్‌కు వచ్చిన వేరుశనగ

జడ్చర్ల: వేరుశనగ ధరల తగ్గింపుపై రైతులు కన్నెర్ర చేశారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకొస్తే.. నామమాత్రపు ధరలకు కొనుగోలు చేయడంతో ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం ఉమ్మడి పాలమూరు జిల్లాతో పాటు వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి రైతులు పెద్దఎత్తున వేరుశనగను తీసుకొచ్చారు. దాదాపు 15వేల బస్తాలకు పైగా వేరుశనగ అమ్మకానికి వచ్చింది. అయితే టెండర్లు పూర్తయిన తర్వాత ప్రకటించిన ధరలను చూసి, రైతులు ఒక్కసారిగా నివ్వెరపోయారు. క్వింటాకు గరిష్ఠంగా రూ.7,155, కనిష్ఠంగా రూ.4,169 ధరలు రావడంతో రైతుల నోట మాటరాని పరిస్థితి నెలకొంది. కొన్నిరోజుల ముందు గరిష్ఠంగా రూ.8వేలకు పైగా పలికిన ధరలు.. ఒక్కసారిగా పడిపోవడం ఏమిటని రైతులు ప్రశ్నించారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.6,377 ఉండగా.. అంతకుమించి ధరలు లభించాల్సి ఉందని, కొన్ని కుప్పలకు మాత్రమే ఎక్కువ ధరలు వేసి, మిగతా కుప్పలకు మద్దతు ధర కంటే తక్కువగా రూ.3వేల నుంచి రూ.5వేల వరకు ధరలను ఖరారు చేశారని రైతులు వాపోయారు. వేరుశనగ నాణ్యత బాగున్నా తక్కువ ధరలు వేయడంతో తాము తీవ్రంగా నష్టపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర కల్పించేదాక వేరుశనగను విక్రయించేదిలేదని ఆందోళనకు దిగారు. మార్కెట్ యార్డు గేట్లు మూసివేసి, మార్కెట్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. గిట్టుబాటు ధర చెల్లించేదాక ఆందోళన విరమించేది లేదని భీష్మించారు. వేరుశనగకు గిట్టుబాటు ధరలను ఖరారు చేయాలని డిమాండ్ చేశారు.

వ్యాపారులతో చర్చలు..

వేరుశనగ ధర తగ్గుదల, రైతుల ఆందోళన నేపథ్యంలో మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి శ్రీనివాసులు వ్యాపారులతో సమావేశమయ్యారు. ధరలపై పునరాలోచన చేయాలని కోరారు. స్థానిక ఎస్‌ఐ చంద్రమోహన్ మార్కెట్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

విత్తనాలకు రూ.15వేలు వెచ్చించాం..

క్వింటా వేరుశనగ విత్తనాలు (వలుకు)ను రూ.15వేలు వెచ్చించి కొనుగోలు చేసినట్లు రైతులు చెప్పారు. కూలీలు, ఎరువులు తదితర ఖర్చులు తడిసి మోపెడయ్యాయని వాపోయారు. మార్కెట్‌లో వస్తున్న ధరను చూస్తే.. పంటకు పెట్టిన పెట్టుబడి సైతం వచ్చే పరిస్థితి లేదన్నారు. మార్కెట్ యార్డులో వేరుశనగను కొనుగోలు చేసే వ్యాపారులు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. వ్యాపారులు కూడబల్కొని ధరలను తక్కువగా వేసి, నిలువు దోపిడీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా బయటి మార్కెట్‌లో వేరుశనగకు డిమాండ్ తగ్గడంతోనే ధరలు పడిపోయాయని వ్యాపారులు తెలిపారు.

రైతులను ముంచుతున్నారు..



అష్టకష్టాలు పడి పండించిన పంటను విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకొస్తే వ్యాపారులు నిలువునా ముంచుతున్నారు. 80 బస్తాల వేరుశనగను మార్కెట్‌కు తీసుకురాగా.. క్వింటాకు రూ.6,500 ధర నిర్ణయించారు. పంటసాగుకు పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదు.

– సంజీవ్, బడన్‌పల్లి, వికారాబాద్ జిల్లా

క్వింటా రూ.6,100 వచ్చింది..



వ్యయప్రయాసలకోర్చి వేరుశనగను మార్కెట్‌కు తీసుకొచ్చా. రెయ్యింబవళ్లు కష్టపడి పండించిన పంటకు కనీస గిట్టుబాటు ధర రాలేదు. క్వింటాకు రూ.6,100 ధర మాత్రమే ఇచ్చారు. రూ.8వేల పైనే ధర వస్తుందని అనుకున్నా. పెద్ద మొత్తంలో ధర తగ్గడంతో దిక్కుతోచడం లేదు.

– వల్లి అబ్బు, జాజాపురపల్లి, కొడంగల్

ఇంత దారుణమా?



బాదేపల్లి మార్కెట్‌లో రైతును దోపిడీ చేస్తున్నారు. క్వింటా వేరుశనగ విత్తనాలను రూ.15 వేలకు తీసుకెళ్లి సాగుచేశాం. పంటను విక్రయించేందుకు మార్కెట్‌కు వస్తే క్వింటా ధర రూ.6,280 మాత్రమే ఇచ్చారు. ఇంత దారుణం ఎక్కడయినా ఉందా? రైతులకు న్యాయం చేయాలి.

– నర్సింహ, బోయిన్‌పల్లి, మిడ్జిల్ మండలం

రూ.5వేలలోపు ధర వచ్చిన రైతులకు రూ.200 పెంపు

రైతుల ఆందోళన నేపథ్యంలో మార్కెట్ కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో వ్యాపారులు అత్యవసర సమావేశం నిర్వహించారు. క్వింటాకు రూ.5వేల కంటే తక్కువ ధర వచ్చిన రైతులకు అదనంగా రూ.200 చొప్పున చెల్లించేవిధంగా నిర్ణయం తీసుకున్నారు. అయితే రూ.5వేల కంటే ఎక్కువ ధర వచ్చిన వారికి కూడా అదనంగా చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. వ్యాపారులు ససేమిరా అనడంతో వెనుదిరిగారు. గురువారం మళ్లీ టెండర్లు వేసి, రైతుల అంగీకారంతో కొనుగోళ్లు చేస్తామని మార్కెట్ అధికారులు తెలిపారు. కాగా వేరుశనగ కుప్పల వద్ద రైతులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే కొడంగల్, వికారాబాద్ తదితర సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు మరో రోజు యార్డులోనే ఉండాల్సిన పరిస్థితులు తలెత్తాయి.

వాహనాల వేగ నియంత్రణకు చర్యలు

- అడిషనల్ ఎస్పీ చిత్తరంజన్


రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

బాలానగర్: జాతీయ రహదారిపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు అడిషనల్ ఎస్పీ ఎస్.చిత్తరంజన్ అన్నారు. బాలానగర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం వ్యాపారులు, వాహనదారులు, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల సహకారంతో పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అండర్‌పాస్ నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని, మరో మూడు నెలల్లో పనులు చేపట్టనున్నట్లు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తెలియజేశారన్నారు. నిబంధనల మేరకు వేగ నియంత్రికలు, అవసరమైన చోట బారికేడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. సర్వీస్‌రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని, అందుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. బాలానగర్‌లో ఓ వ్యాపారి దుకాణం ముందు అదనంగా షెడ్ ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. ఇలా 20 ఫీట్ల వెడల్పుతో ఉన్న సర్వీస్ రోడ్డు 10 ఫీట్లు కూడా లేకుండాపోతుందని గుర్తుచేశారు. రోడ్లపై ఆక్రమణలను స్వచ్ఛందంగా తీసివేయాలని సూచించారు. రోడ్లపై ఆటోలు ఇతర వాహనాలను నిలపరాదన్నారు. కాగా వాహనాల్లో తరలించే కంకర రోడ్డుపై పడుతుందని, భారీ వాహనాలతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని పలువురు ఏఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. అదనపు ఎస్పీ రాములు, రూరల్ సీఐ జమ్ములప్ప, ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐలు శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డి, శివనాయుడు ఉన్నారు.


హాజరైన వ్యాపారులు, వాహనదారులు

ఆ సంతకాలు మావి కావు

- తహసీల్దార్, పోలీసులకు చౌదూర్ గ్రామస్తుల ఫిర్యాదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న చౌదూర్ ప్రజాప్రతినిధులు, రైతులు

నవాబుపేట: గ్రామశివారు పంటపొలాల నడుమ క్రషర్ మిషన్ ఏర్పాటు సందర్భంగా చేపట్టిన విచారణలో ఎంపీటీసీ సభ్యుడితో పాటు రైతుల సంతకాలు ఫోర్జరీ చేశారని మండలంలోని చౌదూర్ గ్రామస్తులు బుధవారం తహసీల్దార్ మల్లికార్జునరావుకు ఫిర్యాదు చేశారు. క్రషర్ మిషన్ యాజమాన్యం ఎంపీటీసీ సభ్యుడు గోపీకృష్ణ సంతకాన్ని కూడా ఫోర్జరీ చేసిందని, ఈ విషయంపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. రెవెన్యూ సిబ్బంది సైతం మొక్కుబడిగా విచారణ జరిపిందని.. ఖాళీ కాగితాలపై పలువురు రైతుల సంతకాలు తీసుకొని క్రషర్ యజమానికి అనుకూలంగా రాసుకున్నారని వివరించారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు. విచారణ జరిపి రైతులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఫిర్యాదు అందజేసిన వారిలో నర్సింహులు, రఘు, శ్రీనివాస్, ఆంజనేయులు, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

యూనివర్సిటీ భూములు కేటాయించడం తగదు


పీయూ గేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: హైకోర్టు కోసం అగ్రికల్చర్ యూనివర్సిటీకి చెందిన 100 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడం తగదని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అన్నారు. పాలమూరు యూనివర్సిటీ ముఖద్వారం వద్ద బుధవారం నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధికి అగ్రికల్చర్ యూనివర్సిటీ ఎంతో ఉపయుక్తంగా ఉందన్నారు. అక్కడ 400 రకాల మొక్కలతో పాటు 80 రకాల పక్షులు ఉన్నాయని.. భూములు కేటాయించడం వల్ల జీవవైవిధ్యం దెబ్బతింటుందన్నారు. తెలంగాణ కొత్త వంగడాల సృష్టి, నూతన పద్ధతులు ప్రవేశ పెట్టడంలో యూనివర్సిటీ కీలకంగా వ్యవహరించిందన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు భరత్, ప్రశాంత్, మహేష్, అంజి పాల్గొన్నారు.

28 నుంచి 'ఓపెన్ స్కూల్' తరగతులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఈనెల 28 ఓపెన్ స్కూల్ డిగ్రీ మొదటి సెమిస్టర్ తరగతులను ప్రారంభ కానున్నట్లు కోఆర్డినేటర్ సత్యనారాయణగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు అడ్మిషన్లు పొందిన విద్యార్థులు సకాలంలో తరగతులకు హాజరుకావాలని సూచించారు.

తేనెటీగల పెంపకంతో ఆదాయం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): తేనెటీగల పెంపకంతో రైతులకు అదనపు ఆదాయం చేకూరుతుందని మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం నేషనల్ బీ బర్డ్ ఆర్థిక సహకారంతో శాస్త్రీయ తేనెటీగల పెంపకంపై ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సెమినార్‌ను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యాన పంటలైన నువ్వులు, ఆవాలు, కుసుమ, కందిపంట చేలల్లో తేనెటీగల పెట్టెలను అమర్చి, లాభాలు పొందవచ్చని అన్నారు. ఏడాది పొడవునా వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నా.. వీటిని పెంచొచ్చన్నారు. తద్వారా వినియోగదారులకు స్థానికంగా తక్కువ ధరకు స్వచ్ఛమైన, నాణ్యమైన తేనె దొరుకుతుందని తెలిపారు. ముఖ్యంగా తేనెటీగలు అంతరించిపోకుండా పరిరక్షించుకోచ్చన్నారు. ప్రస్తుతం తేనె వినియోగం పెరిగిందని, మన వద్ద డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తి జరగడం లేదని చెప్పారు. మార్కెట్‌లో వినియోగదారులకు నకిలీ తేనె అంటగడుతున్నారని.. అందుకే రైతులు తేనెటీగల పెంపకాన్ని ఎంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం కూడా తేనె ఉత్పత్తిని ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఓ యాదయ్య, డీఏఓ బి.వెంకటేష్, శాస్త్రవేత్తలు డా.సునీత, డా.అరుణశ్రీ, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డా.భరత్‌భూషణ్‌రావు పాల్గొన్నారు.

ఇరిగేషన్ శాఖ ఉద్యోగి హఠాన్మరణం


విజయభాస్కర్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: గద్వాల పట్టణంలోని బుర్దపేటకు చెందిన ఇరిగేషన్ శాఖ సీనియర్ అసిస్టెంట్ విజయభాస్కర్ మంగళవారం సాయంత్రం తిరుపతిలో గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దిగ్భ్రాంతిని తెలియజేశారు. బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా విజయభాస్కర్ పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

విద్యార్థి దశ నుంచే కష్టపడి చదవాలి


దేవరకద్ర జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులతో అదనపు కలెక్టర్ మోహన్‌రావు

మహబూబ్‌నగర్ రూరల్: భవిష్యత్‌లో సమాజంలో ఉన్నత స్థానం సంపాదించాలంటే విద్యార్థి దశ నుంచే కష్టపడి చదవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు పిలుపునిచ్చారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ బాలిక దినోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలోని విద్యార్థులు చదువుకునేందుకు అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. పదవ తరగతి విద్యార్థులు ఇంగ్లిష్‌లో కనీసం 2000 పదాలకు నోటికి అర్థాలు తెలిసి ఉండాలని, ప్రతి ఒక్కరూ కనీస అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్న వారందరూ ఒకప్పుడు బాగా చదువుకోవడం ద్వారానే ఆ స్థాయికి వచ్చారని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీలలో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. కార్యక్రమంలో డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ లీగల్ హెడ్ పుట్టపాగా రఘుపతి, ఇన్‌చార్జి జిల్లా సంక్షేమశాఖ అధికారి జ్యోతి, సీఐ జ్యామెనల్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్రూం ఇళ్లకు తాళం

రాజాపూర్: రాజాపూర్ మండలంలోని చొక్కంపేటలో నిర్మించిన 32 డబుల్‌బెడ్రూం ఇళ్లకు బుధవారం అదనపు కలెక్టర్ మోహన్‌రావు తాళం వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్‌బెడ్రూం ఇళ్లను ఎవరికి కేటాయించలేదని తెలిపారు. ఇళ్ల కేటాయింపు ప్రక్రియను త్వరలోనే చేపడతామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, హౌసింగ్ ఈఈ, ఏఈలు ఉన్నారు.

రామన్‌పాడులో పూర్తి స్థాయి నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో బుధవారం పూర్తి స్థాయిలో 1,021 అడుగులకు నీటిమట్టం చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,080 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సమాంతర కాల్వ ద్వారా నీటి విడుదలను నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ నుంచి 980 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ సింగిరెడ్డి రవీంద్‌రెడ్డి తెలిపారు.

జోగుళాంబ ఆలయానికి రూ.4లక్షల విరాళం


రూ.4లక్షల డీడీని అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయానికి బుధవారం కర్నూల్‌కు చెందిన కేఎంసీ కంపెనీ నిర్వాహకులు ప్రభాకర్‌రెడ్డి–కవిత దంపతులు రూ.4 లక్షల విరాళం అందజేశారు. సదరు మొత్తాన్ని డీడీ రూపంలో చెల్లించినట్లు ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు.ఆలయ చైర్మన్ చిన్నకృష్ణయ్య, ధర్మకర్త వెంకటనారాయణరెడ్డిలు ప్రభాకర్‌రెడ్డి దంపతులను శేషవస్త్రాలతో సత్కరించి, అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

ప్రజారవాణాలో డ్రైవర్ల ప్రాధాన్యత ఎనలేనిది


డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్‌ఎం శ్రీదేవి

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజారవాణా, వస్తు రవాణాలో డ్రైవర్ల ప్రాధాన్యత ఎనలేనిదని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా ఆర్టీసీ డ్రైవర్లకు పూలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్‌ఎం మాట్లాడుతూ విధి నిర్వహణలో డ్రైవర్లు అంకితభావంతో పని చేస్తూ ప్రమాదాలను సున్న శాతానికి తేవడానికి ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. మన సంస్థలో నిరంతరం ఎంతో అప్రమత్తంగా, జాగ్రత్తగా వాహనాలను నడుపుతూ దేశంలోని మిగతా సంస్థల కంటే మెరుగైన సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నట్లు తెలిపారు. సమయపాలన, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ శ్యామల తదితరుల ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం

స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను 99592 26295 నంబర్‌కు తెలియజేయాలని ఆమె కోరారు.

హోరాహోరీగా క్రికెట్ టోర్నీ

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న సీవీకే ఆల్ ఇండియా లెవల్ టీ–20 క్రికెట్ టోర్నీ హోరాహోరీగా కొనసాగుతోంది. బుధవారం ప్రీ క్వార్టర్స్‌లో జరిగిన మ్యాచ్‌లో రేవంత్ రైజర్స్, వైభవ్ గైక్వాడ్ ఐపీఎస్ ఎలెవన్ జట్లు గెలిచాయి. గ్రూప్–ఏ నుంచి ఉదయం సెషన్‌లో యూనీడ్స్ వారియర్స్ వర్సెస్ రేవంత్ రైజర్స్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి, బ్యాటింగ్ ఎంచుకున్న యూ నీడ్స్ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రేవంత్ రైజర్స్ 17.2 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 176 పరుగులు సాధించి, 8 వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. మధ్యాహ్నం సెషన్‌లో గ్రూప్–బీ నుంచి ఏవైజర్ సీనియర్స్ వర్సెస్ వైభవ్ గైక్వాడ్ ఐపీఎస్ ఎలెవన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఏవైజర్ 15.4 ఓవర్లలో 82 పరుగులకే ఆలౌటయ్యింది. 83 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన వైభవ్ గైక్వాడ్ ఐపీఎస్ ఎలెవన్ జట్టు 6.4 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 87 పరుగులు చేసింది. దీంతో 8 వికెట్ల తేడాతో వైభవ్ గైక్వాడ్ ఐపీఎస్ ఎలెవన్ విజయం అందుకుంది. జట్టులో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ 8 బంతులు ఆడి, 7 పరుగులు చేశారు. అంతకుముందు చక్కని ఫీల్డింగ్ చేసి అద్భుతమైన క్యాచ్ అందుకున్నారు. అచ్చంపేట డీఎస్పీ కృష్ణకిషోర్, సీఐ అనుదీప్, ఎస్‌ఐ గోవర్ధన్ మ్యాచ్‌లను తిలకించారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఎర్రవల్లిచౌరస్తా: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఆటోను బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు కోదండాపురం ఎస్‌ఐ కృష్ణదేవ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. ఎర్రవల్లి మండలం కొండేరుకు చెందిన వెంకట్రాముడు తన ఆటోలో పుటాన్‌దొడ్డి నుంచి రేషన్ బియ్యాన్ని ఎర్రవల్లి వైపు తరలిస్తున్నాడు. ఈ క్రమంలో కోదండాపురం స్టేజీలో వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులు.. ఆటోలో 14 బస్తాల (7 క్వింటాళ్ల) రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించి, అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

గద్వాల పట్టణంలో..

గద్వాల క్రైం: గుట్టుగా నిల్వ ఉంచుకున్న రేషన్ బియ్యంను సీజ్ చేసినట్లు గద్వాల పట్టణ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. బుధవారం రాత్రి రాఘవేంద్ర కాలనీకి చెందిన ఎరుకలి నవరన్న ఇంట్లో రేషన్ బియ్యం ఉన్నట్లు సమాచారం మేరకు సోదాలు చేశారు. ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యంను గుర్తించి, సీజ్ చేశారు.అక్రమంగా రేషన్ బియ్యంను నిల్వ ఉంచుకున్న సదరు వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గ్యాస్ట్రో ఇంటెస్టైనల్ బ్లీడింగ్‌ను అరికట్టడానికి 'హేమోస్ప్రే'

ఇండియాలో తొలిసారి ఈ సాంకేతికతను ఉపయోగించిన ఏఐజీ హాస్పిటల్స్



సాక్షి, హైదరాబాద్: గ్యాస్ట్రోఇంటెస్టైనల్ (జీఐ) రక్తస్రావం ఆపడానికి హేమోస్ప్రే టెక్నాలజీని మన దేశంలో మొట్టమొదటిసారిగా ఏఐజీ హాస్పిటల్స్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టులు ఉపయోగించారు. ఈ ప్రత్యేకమైన ఎండోస్కోపిక్ స్ప్రే 10 నిమిషాల కంటే తక్కువ వ్యవధిలోనే అంతర్గత రక్తస్రావాన్ని ఆపి, ప్రమాదస్థితి నుంచి కాపాడుతుందని ఏఐజీ ఆసుపత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి వెల్లడించారు. ఈ సాంకేతికత గురించి ఆయన మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో ఇది చాలా ఉపయోగపడుతుందని చెప్పారు. హేమోస్టాసిస్ (రక్తస్రావం ఆపే ప్రక్రియ) కోసం ఖనిజ మిశ్రమం పొడితో తయారుచేసిన ఈ హేమోస్ప్రే బాగా పని చేస్తుం దన్నారు. ఈ స్ప్రే జీర్ణాశయం భద్రత, సమర్థతను పెంచడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందని చెప్పారు. అన్నవాహిక, కడుపులోని జీర్ణాశయాంతర పేగుల్లో రక్తస్రావం తీవ్రమైన రక్త నష్టానికి దారితీస్తుందని, ఈ పరిస్థితికి తమ ఆధునిక టెక్నాలజీ చెక్ పెడుతుందని తెలిపారు. హేమోస్ప్రేను మొదటిసారిగా లివర్ సిర్రోసిస్‌తో బాధపడుతున్న 49 ఏళ్ల మహిళా పేషెంట్‌పై డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి, డాక్టర్ మోహన్ రాంచందాని ప్రయోగించారు.

బీసీ కులాల పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర విభజన తర్వాత తమ కులాలను ఓబీసీ జాబితా నుంచి తప్పించారంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ వాయిదా వేసింది. విభజన అనంతరం తెలంగాణకు చెందిన సుమారు 28 వెనకబడిన కులాలు రిజర్వేషన్ల విషయంలో సమస్యలు ఎదుర్కొంటున్నాయంటూ దాఖలైన పలు పిటిషన్లు బుధవారం జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చాయి. సుప్రీంకోర్టులో రాష్ట్ర న్యాయవాదుల ప్యానెల్ మారిందని, అదేవిధంగా రాష్ట్రంలో ప్రభుత్వం మారిందని ఈ నేపథ్యంలో మూడు వారాలు గడువు ఇవ్వాలని తెలంగాణ తరఫు న్యాయవాది ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం మూడు వారాలపాటు విచారణ వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

అంతరాలపై విద్యాయుద్ధం

పేదరికానికి నాణ్యమైన విద్యే సరైన మందు - ఇండియా టుడే సదస్సులో ఏపీ సీఎం వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: 'పేదరిక నిర్మూలన నాణ్యమైన చదువు ద్వారానే సాధ్యమని నేను నమ్ముతాను. అది ప్రతి ఒక్కరి హక్కు కావాలి. పేద పిల్లలు తెలుగు మీడియంకు పరిమితమైతే, సంపన్నుల పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో చదువుతున్నారు. సంపన్నులకు అందే నాణ్యమైన చదువులు పేద పిల్లలకూ అందాలన్నదే మా లక్ష్యం' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తిరుపతిలో జరుగుతున్న ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్ రెండో రోజు కార్యక్రమంలో బుధవారం సీనియర్ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్ అడిగిన ఓ ప్రశ్నకు ఇలా సమాధానం చెప్పారు. పిల్లలు ఓటర్లు కాదు కాబట్టి వారి గురించి ఎవరూ పట్టించుకోరని, ఇది దురదృష్టకరమని అన్నారు. అయితే పిల్లలు మంచి విద్యావంతులైతేనే, వారికి నాణ్యతతో కూడిన విద్యను అందిస్తేనే.. సమాజంలో దారిద్య్రం పోతుందని నొక్కి చెప్పారు. పది మంది నిరుపేద విద్యార్థులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమెరికాకు పంపించడమే కాకుండా వైట్‌హౌస్‌కు కూడా తీసుకెళ్లడం గొప్ప విషయమని చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న విద్యా సంస్కరణలు, పథకాలు చాలా ఆకర్షిస్తున్నాయని ఈ సందర్భంగా రాజ్‌దీప్ అభినందించారు. రాజ్‌దీప్, సీఎం వైఎస్ జగన్ మధ్య జరిగిన సంభాషణ వివరాలు ఇలా ఉన్నాయి.

రాజ్‌దీప్ సర్దేశాయ్ : విద్యా రంగంలో ఇంత మంచి చేస్తున్నా, ప్రచారానికి ఎందుకు దూరంగా ఉంటారు?

సీఎం జగన్: ఇండియా టుడే జర్నలిస్టులు ఇక్కడి స్కూల్స్ సందర్శించి, అభివృద్ధి పనులు స్వయంగా చూడడం ఎంతో ఆనందంగా ఉంది. అందుకు మీకు అభినందనలు. ఇక్కడ మేము ఏయే పనులు చేశామనేది చెప్పుకోవడం కాకుండా, మీరు స్వయంగా చూడడం నాకెంతో సంతోషం కలిగిస్తోంది.

రాజ్‌దీప్: సాధారణంగా అన్ని ప్రభుత్వాలు విద్య, వైద్య రంగాలపై ఎక్కువగా వ్యయం చేయవనే విమర్శలు వినిపిస్తుంటాయి. అందుకు భిన్నంగా మీరు ఈ రెండు రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి, వాటిని అభివృద్ధి చేసి చూపించాలనుకుంటున్నారా?

సీఎం జగన్ : పేదరిక నిర్మూలనకు నాణ్యతతో కూడిన విద్య అనేది కీలకమని నేను గట్టిగా నమ్ముతాను. విద్యా హక్కు అనేది ఇంకా నినాదంగా మిగలకూడదు. నాణ్యతతో కూడిన విద్య అనేది హక్కుగా మారాలి. నిరుపేదలు ఒక చదువుకు పరిమితమైతే, సంపన్నుల పిల్లలు వేరే చదువులు చదువుతున్నారు. నిరుపేద పిల్లలు కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే చదవడం, అది కూడా కేవలం తెలుగు మీడియంలోనే చదవడం.. మరోవైపు ధనికులైన పిల్లలు ప్రైవేటు స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంలో చదవడం సరికాదు. నిరుపేదలు, ధనికుల మధ్య కొనసాగుతున్న ఈ వ్యత్యాసం, తేడా తొలగాలి. ధనికుల మాదిరిగా నిరుపేద పిల్లలు కూడా చదవాలి. వారికి ఆ విధంగా విద్యను అందించాలి. ఆ ఆలోచన నుంచి వచ్చినవే ఈ మార్పులు. మా ప్రభుత్వం ఆ దిశలోనే పని చేస్తోంది. నిరుపేద పిల్లలకు కూడా అత్యుత్తమ నాణ్యతతో కూడిన విద్య, ఇంగ్లిష్ మీడియంలో బోధన కొనసాగాలి.

రాజ్‌దీప్: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో బోధన, మూడో తరగతి నుంచే గ్లోబల్ విద్య, టోఫెల్‌లో శిక్షణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే దీనిపై విమర్శలు వినిపిస్తున్నాయి. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు వంటి నేత కూడా దీనిపై విమర్శలు చేస్తున్నారు.

సీఎం జగన్: ప్రభుత్వ పాఠశాలలను ఇంగ్లిష్ మీడియంలోకి మారుస్తున్నారని విమర్శలు చేస్తున్న వారందరినీ నేను ఒక్కటే అడుగుతున్నాను. వారి పిల్లలు, వారి మనవళ్లు, మనవరాళ్లు ఏ మీడియంలో చదువుతున్నారు? వారిని తెలుగు మీడియం స్కూళ్లకే పంపిస్తున్నారా? అదే నా సూటి ప్రశ్న. ఇంగ్లిష్ మీడియం వైపు నా చొరవను ప్రశ్నించే ముందు.. ముందుగా నా ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలి.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

రాజ్‌దీప్: నిజంగా ఇంగ్లిష్ మీడియం, తెలుగు మీడియం మధ్య ఉన్న గ్యాప్‌ను అంత సులభంగా మార్చగలరా? దానివల్ల పిల్లలు ఇబ్బంది పడే పరిస్థితి రాదా? వెంకయ్యనాయుడు లాంటి వారికి ఇదే మీ సమాధానమా?

సీఎం జగన్: గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను ఏకపక్షంగా ఇంగ్లిష్ మీడియంలోకి మార్చడం లేదు. ప్రతి ఒక్కటీ ఒక పద్ధతి ప్రకారం, శాస్త్రీయ విధానంలో సాగుతోంది. ఒక సమగ్ర విధానంలో కొనసాగుతోంది. ప్రతి పుస్తకాన్ని బైలింగ్యువల్.. అంటే ఒక పేజీ ఇంగ్లిష్, పక్క పేజీ తెలుగులో ముద్రిస్తున్నాం. ఇంకా బైజూస్ కంటెంట్‌ను కూడా తీసుకొచ్చాం. ప్రభుత్వ పాఠశాలల్లో అనూహ్య మార్పులు చేస్తున్నాం. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ఆరో తరగతి నుంచి, ఆపై తరగతుల్లోని ప్రతి క్లాస్‌రూమ్‌లో ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్) ఏర్పాటు చేస్తున్నాం. ఆ మేరకు 62 వేల తరగతులు ఉండగా, ఇప్పటికే 40 వేల తరగతి గదుల్లో ఐఎఫ్‌పీలు ఏర్పాటు చేశాం. మిగిలిన తరగతి గదుల్లో వచ్చే నెల చివరి నాటికి ఐఎఫ్‌పీలు ఏర్పాటు చేసే లక్ష్యంతో పని చేస్తున్నాం. ఆ విధంగా ఒక ప్రణాళికా బద్ధంగా పాఠశాల విద్యా రంగంలో వినూత్న మార్పుల దిశలో పని చేస్తున్నాం. బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాలు, 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్, టీచర్లలో నైపుణ్యం, సామర్థ్యం పెంపు, బైజూస్ కంటెంట్, తరగతి గదుల్లో ఐఎఫ్‌పీల ఏర్పాటు.. ఇలా వీటన్నింటి వల్ల ప్రాథమిక విద్యా రంగంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇవన్నీ కాకుండా.. పిల్లలు 8వ తరగతిలోకి వచ్చే సరికి, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు ఇస్తున్నాం.

ఇదేమి రాజ్యం..?

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహిస్తోంది. హైకోర్టుకు భూకేటాయింపు జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం వర్సిటీలోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద చేపట్టిన ఆందోళనకు ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ హాజరయ్యారు. ఆందోళన విషయం తెలిసిన రాజేంద్రనగర్ పోలీసులు అక్కడికి చేరుకుని, నిరసన తెలుపుతున్నవారిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఝాన్సీ పోలీసుల నుంచి తప్పించుకుని ముందుకు పరుగెత్తారు. స్కూటీపై వచ్చిన ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు.. ఝాన్సీ జుట్టుపట్టుకుని లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో ఆమె కిందపడిపోయింది. చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. ఈ క్రమంలో పోలీసులు ఝాన్సీతోపాటు 15 మంది ఏబీవీపీ నాయకులను అదుపులోకి తీసుకొని రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో వ్యక్తిగత పూచీకత్తుపై వదిలేశారు.

కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలంటూ..

ఆందోళన సమయంలో ఝాన్సీని పోలీసులు జుట్టు పట్టి లాగడం, ఆమె కిందపడిపోవడాన్ని అక్కడే ఉన్న కొందరు విద్యార్థులు వీడియో తీశారు. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విషయం తెలుసుకున్న బీజేపీ, ఏబీవీపీ నాయకులు.. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఝాన్సీని పరామర్శించారు. దురుసుగా ప్రవర్తించిన మహిళా కానిస్టేబుళ్లను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గురువారం డీజీపీని, హైదరాబాద్ సీపీని కలిసి దీనిపై వినతిపత్రం అందిస్తామని వెల్లడించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థి నేతలపై పోలీసులు దుశ్చర్యలకు పాల్పడడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

అవినీతి రూ.500 కోట్లు!

హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్, మెట్రోరైల్ డైరెక్టర్ శివబాలకృష్ణపై ఏసీబీ దాడులు

సాక్షి, హైదరాబాద్: భవన అనుమతులు, టౌన్‌ప్లానింగ్‌లో అడ్డగోలుగా అవినీతికి పాల్పడి, వందల కోట్లు అక్రమంగా కూడబెట్టిన తిమింగలం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి చిక్కింది. హైదరాబాద్ నగర అభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) మాజీ డైరెక్టర్, ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోరైల్ లిమిటెడ్ (హెచ్‌ఆర్‌ఎంఎల్) డైరెక్టర్‌గా ఉన్న శివబాలకృష్ణ నివాసం, కార్యాలయాలు, ఆయన బంధువుల ఇళ్లలో ఏసీబీ అధికారులు బుధవారం విస్తృతంగా సోదాలు చేపట్టారు. ఆయన తన పదవిని, ఓ సీనియర్ ఐఏఎస్ అధికారితో సన్నిహిత పరిచయాన్ని అడ్డుపెట్టుకుని ఏకంగా రూ.500 కోట్ల వరకు అక్రమ ఆస్తులు కూడబెట్టినట్టుగా అంచనా వేస్తున్నారు. బుధవారం సాయంత్రం వరకు స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువే బహిరంగ మార్కెట్లో రూ.వంద కోట్లకుపైగానే ఉంటుందని చెప్తున్నారు. ఇంకా నిర్ధారించి, విలువ తేల్చాల్సిన ఆస్తులు భారీగానే ఉన్నాయని అంటున్నారు. హెచ్‌ఎండీఏ డైరెక్టర్‌గా పనిచేసిన సమయంలో శివబాలకృష్ణ భారీగా అవినీతికి పాల్పడి, అక్రమ ఆస్తులు కూడబెట్టినట్టుగా ఫిర్యాదులు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

17 చోట్ల ఏకకాలంలో సోదాలు

శివ బాలకృష్ణ హెచ్‌ఎండీఏలో భూమార్పిడి వినియోగం, హైరైజ్ భవనాలకు అనుమతులు, కీలకమైన పట్టణ ప్రణాళిక (టౌన్‌ప్లానింగ్)కు సంబంధించిన పోస్టుల్లో పనిచేశారు. ఈ క్రమంలో ఆయన ఉన్నతాధికారుల అండదండలతో కీలక పోస్టుల్లో ఏళ్లతరబడి పాతుకుపోయి భారీగా అక్రమాలకు, అవినీతికి పాల్పడ్డారన్న సమాచారం మేరకు ఏసీబీ దాడులకు దిగింది. అధికారులు బుధవారం ఉదయం హైదరాబాద్ శివార్లలోని పుప్పాలగూడలో ఉన్న శివబాలకృష్ణ ఇల్లు, కార్యాలయాలు, బంధువుల ఇళ్లు కలిసి మొత్తం 17 చోట్ల ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఇంట్లో అయితే ఏకంగా 20 మంది అధికారులు అన్ని మూలలా జల్లెడపట్టినట్టు తెలిసింది. ఈ సందర్భంగా భారీగా స్థిర, చరాస్తులను గుర్తించారు. పెద్ద సంఖ్యలో ప్లాట్లు, ఫ్లాట్లు, బినామీల పేరిట పెట్టిన ఇతర స్థిరాస్తుల డాక్యుమెంట్లు, రూ.40 లక్షల నగదు, భారీగా బంగారు, వజ్రాభరణాలు, వెండి, పదిహేను వరకు ఐఫోన్‌లు, పదుల సంఖ్యలో వాచ్‌లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. ఆయనకు పెద్ద సంఖ్యలో బ్యాంకు లాకర్లు ఉన్నట్టు సమాచారం. వాటిని తెరిస్తే మరింత భారీగా ఆస్తుల బయటపడవచ్చని ఏసీబీ అధికారులు చెప్తున్నారు. గురువారం కూడా సోదాలు జరిపే అవకాశం ఉందని, తనిఖీలు పూర్తయ్యే సరికి ఆస్తుల బహిరంగ మార్కెట్ విలువ రూ.500 కోట్ల వరకు తేలవచ్చని అంటున్నారు.

సహకరించని కుటుంబ సభ్యులు, బంధువులు

ఏసీబీ అధికారులు సోదాలు చేసిన సమయంలో శివ బాలకృష్ణ, ఆయన కుటుంబ సభ్యులు ఏమాత్రం సహకరించలేదని అధికారులు అంటున్నారు. బినామీ ఆస్తుల పత్రాలకు సంబంధించి ప్రశ్నిస్తే శివ బాలకృష్ణ సమాధానం ఇవ్వనట్టు తెలిసింది. ఆయన కారును కూడా అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. శివబాలకృష్ణ పెద్ద ఎత్తున పెండింగ్ ఫైల్స్‌ను పురపాలక శాఖ ఉన్నతాధికారి అండదండలతో క్లియర్ చేశారని.. పలు నిర్మాణ సంస్థల యజమానుల నుంచి భారీగా సొమ్ము తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చారని ఆరోపణలు ఉన్నాయి. శివ బాలకృష్ణ వ్యవహారశైలితో నష్టపోయిన కొందరు బిల్డర్లు ఏసీబీకి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఆయనపై ఏసీబీ దాడి నేపథ్యంలో కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారుల్లో ఆందోళన కనిపిస్తోంది.

బ్యాంకు లాకర్లను తెరవాల్సి ఉంది

ఆదాయానికి మించి ఆస్తులున్నట్టు ఫిర్యాదులు అందడంతో శివబాలకృష్ణపై దాడులు చేపట్టినట్టు ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సుధీంద్ర బుధవారం సాయంత్రం వెల్లడించారు. "బాలకృష్ణ 2018–2023 మధ్య హెచ్‌ఎండీఏ డైరెక్టర్‌గా కొనసాగారు. మొత్తం 17 చోట్ల సోదాలు నిర్వహిస్తున్నాం. భారీ ఎత్తున అతి విలువైన భూముల పత్రాలు దొరికాయి. అవన్నీ బినామీల పేరిట కొనుగోలు చేశారు. వాటిని పరిశీలిస్తున్నాం. బాలకృష్ణ ఇంట్లో రూ.40 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నాం. బుధవారం అర్ధరాత్రి వరకు, అవసరమైతే గురువారం కూడా సోదాలు కొనసాగిస్తాం. ఇంకా బ్యాంకు లాకర్లను పరిశీలించాల్సి ఉంది.."అని ఏసీబీ డీజీ తెలిపారు. శివ బాలకృష్ణపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేశామని, గురువారం ఏసీబీ కోర్టు ముందు ప్రవేశపెడతామని తెలిపారు.



సోదాలు చేస్తున్న అధికారులు

ఓ సీనియర్ ఐఏఎస్ భాగస్వామ్యంపై ఆరా!

శివబాలకృష్ణ ఓ సీనియర్ ఐఏఎస్ అధికారితో సన్నిహితంగా మెలిగారని, ఆయన కనుసన్నల్లో అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. సదరు ఐఏఎస్ అధికారికి ఈ అవినీతిలో భాగస్వామ్యంపైనా ఆరా తీస్తున్నట్టు చెప్తున్నారు. పురపాలక శాఖలోని అధికారులు సైతం.. సదరు సీనియర్ ఐఏఎస్ అధికారి లక్ష్యంగా దాడులు జరిగాయని చర్చించుకుంటున్నారు. శివబాలకృష్ణ భారీగా ముడుపులు తీసుకోవడమేకాక, కొందరి నుంచి ఆస్తులను రిజిస్టర్ చేయించుకున్నట్టుగా ఏసీబీ అధికారులకు కచ్చితమైన సమాచారం లభించిందని.. ఈ క్రమంలోనే దాడులు జరిగాయని అంటున్నారు. సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్‌ను కొత్త సర్కారు ఏసీబీ డైరెక్టర్ జనరల్‌గా నియమించాక ఈ కేసుపై ఫోకస్ పెట్టడం గమనార్హం.

వైభవంగా సీతారాముల కల్యాణం



ఎర్రవల్లిచౌరస్తా: శ్రీరాముడి జన్మనక్షత్రం పునర్వసును పురస్కరించుకొని బుధవారం బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు భువనచంద్ర, దత్తుస్వామి సీతారాముల ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించి వేదమంత్రోచ్ఛారణల నడుమ కల్యాణం జరిపించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. హాజరైన భక్తులకు పాలకమండలి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించినట్లు ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు వివరించారు.

ఇంటర్ అర్హతతో అగ్నివీర్‌గా అవకాశం

- ఎయిర్ వింగ్ కమాండ్ గురుప్రీత్ సింగ్ హత్వాల్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ అర్హతతో అగ్నివీర్‌గా అవకాశం లభిస్తుందని ఎయిర్ వింగ్ కమాండ్ గురుప్రీత్ సింగ్ హత్వాల్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో అగ్నిపథ్ స్కీ, ఇండియన్ ఎయిర్ ఫోర్సుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నిరంతరం గగనతల గస్తీ, దేశ రక్షణలో అత్యంత కీలకమైన విభాగం ఎయిర్ ఫోర్సు అని తెలిపారు. ఇంటర్మీడియట్ అర్హతతో కొలువు సాధించేందుకు అవకాశం ఉందన్నారు. ఎంపికలు మూడు దశల్లో కొనసాగుతాయని, వివిధ దశల్లో ప్రతి సంవత్సరం వేతనం సైతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి విద్యార్థి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఇందులో ఎన్‌సీసీ విద్యార్థులు అదనంగా 7 మార్కులు పొందవచ్చని సూచించారు. చిన్న వయస్సులో ఉద్యోగాలు సాధిస్తే జీవితం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో డీవైఈఓ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి రాఘవేందర్ రెడ్డి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి పరపతిని పెంచుదాం



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

- లోక్‌సభ అభ్యర్థి గెలుపునకు సమష్టిగా పనిచేయాలి
- మహబూబ్‌నగర్‌లో మినీ క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు జీసీసీఐ హామీ
- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచందర్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఇక్కడి లోక్‌సభకు సీఎం రేవంత్‌రెడ్డి ఇన్‌చార్జిగా ఉన్నారని.. లోక్‌సభ అభ్యర్థిని గెలిపించి, ఆయన పరపతిని ఢిల్లీ స్థాయిలో పెంచుదామని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని జేజేఆర్ గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం మహబూబ్‌నగర్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన లోక్‌సభ ఎన్నికల సమయంలో పలువురు నాయకులు పార్టీని వీడినా ప్రతికూల పరిస్థితుల్లో పోటీచేశానని తెలిపారు. కార్యకర్తలు ఎంతో కష్టపడి పనిచేశారని.. వారి పనితీరును స్వయంగా చూశానన్నారు. ప్రస్తుతం లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారని.. ఇక్కడ ఎంపీతో పాటు రాష్ట్రంలోని ఎక్కువ ఎంపీ స్థానాల్లో గెలిచి, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడంలో కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ అభ్యర్థి గెలుపునకు కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని కోరారు. ఇటీవల తాను బీసీసీఐతో మాట్లాడగా.. మహబూబ్‌నగర్‌లో రూ.15 కోట్లతో మినీ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా సాల్జెజీ కంపెనీతో మాట్లాడానని రూ.వెయ్యి కోట్లతో దేశంలో రెండో ఉత్పత్తి కేంద్రాన్ని మహబూబ్‌నగర్ లోక్‌సభ పరిధిలో ఏర్పాటు చేయడానికి ఒప్పుకున్నట్లు చెప్పారు.

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల కంటే ముందే బీఆర్‌ఎస్ భూస్థాపితమవుతుందన్నారు. టీఆర్‌ఎస్ నుంచి బీఆర్‌ఎస్‌గా మారినప్పుడే ఆ పార్టీకి తెలంగాణతో ఉన్న పేగుబంధం తెగిపోయిందన్నారు. నీతి, నిజాయితీకి మారుపేరుగా నిలిచే చల్లా వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.
- ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, కసిరెడ్డి నారాయణరెడ్డి, పర్ణికారెడ్డి, అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడి పనిచేయడం వల్లే తాము ఎమ్మెల్యేలుగా గెలుపొందామని తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకమైనవని అన్నారు. లోక్‌సభ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి, సీఎం రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీకి బహుమతిగా ఇద్దామని పిలుపునిచ్చారు.
- అసెంబ్లీ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జె.చంద్రశేఖర్ ప్రసంగం చర్చనీయాంశంగా మారింది. గత పదేళ్ల నుంచి ఎన్నో ఇబ్బందులు పడుతూ పార్టీని కాపాడుకుంటూ వచ్చామని.. ఇప్పుడు కొత్తగా పార్టీలోకి ఎవరెవరో వస్తున్నారన్నారు. ఏళ్ల నుంచి పార్టీకి కష్టపడుతున్న కార్యకర్తలను గుర్తించి పదవుల కేటాయింపుల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, వినోద్‌కుమార్, సంజీవ్ ముదిరాజ్, హర్షవర్ధన్‌రెడ్డి, ఎన్‌పీ వెంకటేశ్, జహీర్ అఖ్తర్, బెనహర్, వసంత, బెక్కరి అనిత, సాయిబాబా, సిరాజ్‌ఖాద్రీ, లింగంనాయక్, లక్ష్మణ్‌యాదవ్, రాములుయాదవ్, అజ్మత్‌అలీ, అబ్దుల్ హక్, అన్వర్‌పాషా ఉన్నారు.

అభయుడి బ్రహ్మోత్సవాలు జయప్రదం చేద్దాం

- జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల టౌన్: ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 3 నుంచి ప్రారంభం కానున్నాయని.. విజయవంతం చేద్దామని జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభయాంజనేయుడి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడు ఉంటాయన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు కావాల్సిన సహకారం అందిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సత్యచంద్రారెడ్డి, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి, వాకిటి శ్రీహరి

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు గురుకులం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు

ధన్వాడ: మధ్యప్రదేశ్‌లో ఈ నెల 25 నుంచి 28 వరకు కొనసాగే 36వ జాతీయ స్థాయి బాలబాలికల నెట్‌బాల్ పోటీలకు మండలంలోని కొండాపూర్‌లోని గిరిజన గురుకులానికి చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజారాం తెలియజేశారు. ఇంటర్ ఒకేషనల్ మొదటి సంవత్సరం చదువుతున్న శ్రీను, గోపి ఎంపికయ్యారని చెప్పారు. వీరు గత నెలలో నాగార్జునసాగర్‌లో కొనసాగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి నారాయణపేట జిల్లా జట్టుకు బంగారు పతకం సాధించి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారన్నారు. వీరి ఎంపికపై వైస్ ప్రిన్సిపాల్ సురేష్‌రావు, నాగమణి, హౌస్ మాస్టర్స్ పురుషోత్తం, సాయిబాబు, ఫిజికల్ డైరెక్టర్ కోచ్ డాక్టర్ రామ్మోహన్‌గౌడ్, పీఈటీ సుగుణాకర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు బయలుదేరిన పీయూ జట్టుతో పీడీ తదితరులు

చెస్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు పీయూ జట్టు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: తమిళనాడులోని భారతీయదాసన్ యూనివర్సిటీలో ఈ నెల 26 నుంచి 29 వరకు చెస్ పోటీలు కొనసాగనున్నాయి. చెస్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు పీయూ జట్టు మంగళవారం బయలుదేరింది. ఈ సందర్భంగా క్రీడాకారులకు పీయూ పీడీ శ్రీనివాస్ ట్రాక్‌సూట్‌లు, యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో గాలెన్న, మధు, భాస్కర్ పాల్గొన్నారు.

కర్పూరి ఠాకూర్ ఆశయాలను నెరవేరుద్దాం

- బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు సంగెం సూర్యారావు

స్టేషన్ మహబూబ్‌నగర్: బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ ఆశయాలను నెరవేరుద్దామని బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు అన్నారు. జిల్లాకేంద్రంలోని ఉమ్మడి బీసీ సమాజ్ కార్యాలయంలో బుధవారం కర్పూరి ఠాకూర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సూర్యారావు మాట్లాడుతూ కర్పూరి ఠాకూర్ ఆశయాలను సాధించే దిశగా అందరం కలిసి ముందుకెళ్తే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. అత్యంత వెనుకబడిన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి అత్యున్నత భారతరత్న పురస్కారాన్ని కేంద్ర ప్రభుత్వం అందజేయడం బీసీ సమాజానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస్‌సాగర్ మాట్లాడుతూ ఓబీసీ రిజర్వేషన్లు అమలుచేసి వారి సామాజిక, ఆర్థిక అభ్యున్నతి కోసం కర్పూరి ఠాకూర్ వేసిన బీజమే బీసీ మండల్ కమిషన్ సిఫార్సుల అమలుకు ప్రాణం పోసిందన్నారు. కార్యక్రమంలో బీసీ జర్నలిస్ట్ సంఘం అధ్యక్షుడు ఆశన్న ముదిరాజ్, బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ సవారి సత్యం సాగర్‌తో పాటు ఆయా సంఘాల ప్రతినిధులు ధన్‌రాజ్, డీకే కృష్ణయ్య, కిన్నెర శేఖర్, ఎం.రమణ, మహేందర్, బుగ్గన్న, లక్ష్మన్న, దేవదాస్, శేఖరాచారి, సుకుమార్, అంజనేయులు సాగర్ పాల్గొన్నారు.



కర్పూరి ఠాకూర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సమాజ్ ప్రతినిధులు

నేడు పీయూ అడ్మిన్ భవనం ముట్టడి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ అడ్మిన్ భవన్‌ను గురువారం ముట్టడి చేయనున్నట్లు విద్యార్థిసంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు పీయూలో పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ చైర్మన్ బత్తిని రాము మాట్లాడుతూ యూనివర్సిటీలో కొన్ని నెలలుగా అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించడంలో యూనివర్సిటీ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల నుంచి అధిక ఫీజుల వసూలు, బాలికల హాస్టల్ సమస్యలు, తరగతి గదులు లేకపోవడం వంటి సమస్యలు నెలకొన్నాయని, వాటిని అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం చూపలేదని, అందుకే అడ్మిన్ భవనం ముట్టడి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సురేందర్, మహేష్, భరత్, శివ, గణేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతిని గుర్తించి ముందుకుసాగాలి

- పీయూ రిజిస్ట్రార్ ప్రొ. గిరిజా మంగతాయారు

జడ్చర్ల టౌన్: తమ సంస్కృతిని గుర్తెరిగి ముందుకు సాగాలని పాలమూరు యూనివర్సిటి రిజిస్ట్రార్ ప్రొ. గిరిజా మంగతాయారు కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ రెండోయూనిట్ శీతాకాల శిబిరంలో భాగంగా బుధవారం రాత్రి కావేరమ్మపేట ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన క్యాంప్ ఫైర్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. మన సంస్కృతితో పాటు వివిధ రాష్ట్రాల సంస్కృతులను అవగాహన చేసుకొని భారతీయతత్వమైన భిన్నత్వంలో ఏకత్వాన్ని పాటించాలని సూచించారు. యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డా. ప్రవీణ మాట్లాడుతూ.. వాలంటీర్లు తల్లి దండ్రులు, గురువులు, విద్యాసంస్థకు రుణపడి ఉండాలన్నారు. విద్యా సంవత్సరంలో వివిధ ఎన్ఎస్ఎస్ క్యాంపులకు ఎంపికైన వాలంటీర్ల తల్లిదండ్రులను కార్యక్రమానికి ఆహ్వానించి సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా క్యాంప్ ఫైర్ జ్యోతిని రిజిస్ట్రార్ వెలిగించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. అప్పియా చిన్నమ్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సుభాషిణి, వార్డు కౌన్సిలర్ బుక్కా మహేష్, కళాశాల సంస్కృత అధ్యాపకులు విఠల్, బాలరాజు, టీం లీడర్ రాఘవులు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న పీయూ రిజిస్ట్రార్ గిరిజా మంగతాయారు